అటు ఇటు తిరుగుతూ.. అవస్థలు పడుతూ!

- పొదిలిలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, డీఈ కార్యాలయాలు
- మార్కాపురం డివిజన్ ప్రజాప్రతినిధులకు ఇబ్బందులు
- సమీక్ష సమావేశాలకు రావాలంటే అధికారులకు తిప్పలు



మార్కాపురంలోని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కార్యాలయం

మార్కాపురం:

వేసవి కాలం సమీపిస్తోంది. ఇప్పటికే మార్కాపురం డివిజన్‌లో తాగునీటి సమస్య మొదలైంది. అయితే డివిజన్ కేంద్రంతోపాటు నియోజకవర్గ కేంద్రమైన మార్కాపురంలో గ్రామీణ నీటి పారుదల శాఖ(ఆర్‌డబ్ల్యూఎస్)కు కార్యాలయం లేదంటే అతిశయోక్తి కాదు. సబ్ కలెక్టర్, డీఎస్పీ, ఆర్‌అండ్‌బీ ఈఈ, డీఈ, నీటి పారుదలశాఖ ఈఈ, డీఈ, పంచాయతీరాజ్ ఈఈ, డీఈ ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని శాఖల డివిజన్ స్థాయి అధికారుల కార్యాలయాలు ఉన్నాయి. రూరల్ వాటర్ సప్లయ్(ఆర్‌డబ్ల్యూఎస్) అధికారి కార్యాలయం పొదిలిలో ఉండటంతో అటు అధికారులకు, ఇటు ప్రజలు, ప్రజాప్రతినిధులకు ఇబ్బందికరంగా మారింది.

మార్కాపురం నియోజకవర్గంలోని సుమారు 83 పంచాయతీల్లోని 105 గ్రామాల ప్రజలకు నీటి సమస్య వస్తే ఆయా గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు పొదిలి వెళ్లి అధికారులకు చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. మార్కాపురంలో కేవలం ఏఈ మాత్రమే ఉంటారు. డీఈ, ఈఈలు కార్యాలయాలు పొదిలిలో ఉన్నాయి. దీంతో నీటి సమస్య వస్తే ప్రజాప్రతినిధులు పొదిలికి పరుగు తీయాల్సి వస్తోంది. అదే సమయంలో సమీక్ష సమావేశాలన్నీ మార్కాపురంలో నిర్వహిస్తుండటంతో అధికారులు పొదిలి నుంచి మార్కాపురానికి రావాల్సిన పరిస్థితి.

మార్కాపురం 21, పొదిలి 20, కొనకనమిట్ల 26, తర్లుపాడు 16, కలిపి మొత్తం 83 పంచాయతీలు ఉన్నాయి. ప్రస్తుతం మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాల్లోని పలు గ్రామాల్లో నీటి సమస్య ప్రారంభమైంది. మార్కాపురం మండలంలోని తిప్పాయపాలెం, రాజుపాలెం తదితర గ్రామాల్లో నీటి సమస్య ఏర్పడింది. గ్రామాల్లో డీప్ బోర్లు వేయాలన్నా, బోర్లకు ప్రతిపాదనలు పంపాలన్నా, ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలన్నా ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులు అనుమతులివ్వాలి. వేసవిలో అనుక్షణం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో పనులు అధికంగా ఉంటాయి. అలాంటి కీలకమైనశాఖకు మార్కాపురంలో కార్యాలయం లేదు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగే డివిజన్ స్థాయి సమావేశాలకు, ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే నియోజకవర్గ స్థాయి సమావేశాలకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పొదిలి నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. మార్కాపురం కార్యాలయ ఆవరణలో పాడైపోయిన వాహనాలు, బోర్ మెటీరియల్స్ ఉన్నాయి. పొదిలిలో ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ లేదా డీఈ కార్యాలయాన్ని మార్కాపురానికి తరలించినట్లయితే అధికారులతో పాటు ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. తర్లుపాడు, మార్కాపురం మండలాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తమ గ్రామాల బోర్ల ప్రతిపాదనల కోసం పొదిలి వెళ్లాల్సి వస్తోంది. డివిజన్ కేంద్రమైన మార్కాపురంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులు లేకపోవడం విచిత్రంగా ఉందని పలువురు సర్పంచ్‌లు పెదవి విరుస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఇప్పటికైనా జోక్యం చేసుకుని మార్కాపురం పట్టణంలో నిరుపయోగంగా ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో ఈఈ లేదా డీఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

సింహ వాహనంపై వేణుగోపాలుడు


సింహ వాహనంపై వేణుగోపాలస్వామి

తర్లుపాడు: బ్రహ్మోత్సవాల్లో భాగంగా తర్లుపాడులోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి శుక్రవారం సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని దేవస్థానం అర్చకులు వెంకట రమణాచార్యులు, లక్ష్మయ తిలక్ స్వామి, కూనపులి రమణయ్య శర్మ, పరిచారకులు సాయిమోహనాచార్యులు ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామివారిని అంగరంగ వైభవంగా సింహవాహనంపై ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామి వారికి పూజలు చేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్త జవ్వాజి విజయభాస్కర్, ఈఓ చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రైతులు గుర్తింపు కార్డులు పొందాలి


రైతులతో మాట్లాడుతున్న బాలాజీనాయక్

గిద్దలూరు రూరల్: వ్యవసాయం చేస్తున్న ప్రతి రైతు గుర్తింపు కార్డు పొందాలని గిద్దలూరు వ్యవసాయ సహాయ సంచాలకులు డి. బాలాజీనాయక్ సూచించారు. మండలంలోని కె.ఎస్.పల్లె గ్రామంలో రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంట నష్టపరిహారం వర్తించాలంటే గుర్తింపు కార్డు తప్పనిసరి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఓ విజయభాస్కర్‌రెడ్డి, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పీజీఎన్ఎఫ్ ఆధ్వర్యంలో రోబోటిక్స్ కోర్సు


విద్యార్థులకు రోబొటిక్స్‌పై అవగాహన కల్పిస్తున్న పీజీఎన్ఎఫ్ బృందం

తర్లుపాడు: ప్రకాశం గ్లోబల్ ఎన్ఆర్ఐ ఫోరం సహకారంతో మండలంలోని చెన్నారెడ్డిపల్లి జెడ్పీ పాఠశాలలో 6,7,8,9 తరగతులు విద్యార్థులకు రోబోటిక్స్ కోర్సును శుక్రవారం ప్రారంభించారు. కోర్సులో భాగంగా 30 మంది విద్యార్థులకు స్టెమ్, కంప్యూటర్ గురించి వివరించారు. మోడల్ రోబోలతో పనితీరును ప్రదర్శించి చూపారు. రోబోల వినియోగం, భవిష్యత్‌లో వాటి ఉపయోగాల గురించి వివరించారు. పోలిశెట్టి చంద్రశేఖర్ రొబోటిక్ మెటీరియల్‌ను ఉచితంగా అందచేశారు. మెంటార్‌గా సిద్దార్థ్ వ్యవహరించారు. మరో మూడు రోజులపాటు విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పీజీఎన్ఎఫ్ ఆర్గనైజర్ శ్రీనివాస్, మాధవి, చంద్రశేఖర్, సిద్దార్థ్‌కు ప్రోగ్రామ్ నిర్వాహకులు రవిశేఖర్ రెడ్డి కోర్సు వివరాలు తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వై శ్రీనివాసరావు, పీజీఎన్ఎఫ్ వలంటీర్ ఓవీ రవిశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రీ సర్వేను పరిశీలించిన జేసీ


రైతులతో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

పొదిలి: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని నందిపాలెంలో భూముల రీ సర్వేను శుక్రవారం జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ పరిశీలించారు. రెవెన్యూ అధికారులు, రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. గ్రౌండ్ ట్రూతింగ్ నోటీసుల జారీపై ఆరా తీశారు. సర్వే సమయంలో రైతులు తమ భూముల వద్దకు వెళ్లి ఏదైనా సమస్యలు ఉంటే అధికారులకు చెప్పాలన్నారు. ఎటువంటి లోపాలు లేకుండా రీ సర్వే చేయాలని ఆదేశించారు. ఆయన వెంట కనిగిరి ఆర్డీఓతోపాటు తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

జవాన్ల త్యాగాలను మరువలేం



జార్జి కాలేజీలో సైనికులకు నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి సురేష్

- మాజీ మంత్రి డాక్టర్ సురేష్

మార్కాపురం: పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన జవాన్ల త్యాగం మరువలేనిదని మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో పుల్వామా ఉగ్ర దాడిలో ప్రాణాలు కోల్పోయి అమరులైన వీరజవాన్లకు ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. ముష్కరుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన 40 మంది అమర వీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. వారి గౌరవార్థం 2 నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కెప్టెన్ అనీల్, ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు, డీన్ మస్తానయ్య, సాధూనాయక్, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలను ప్రభుత్వమే పూర్తిచేయాలి

- కేంద్ర మంత్రికి బీజేపీ నేతల వినతి


కేంద్ర మంత్రికి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

మార్కాపురం: మార్కాపురం శివార్లలో అర్ధంతరంగా నిలిచిన మెడికల్ కళాశాలను ప్రభుత్వమే పూర్తి చేయాలని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతిరాజ శ్రీనివాసవర్మకు మార్కాపురం బీజేపీ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు వినతిపత్రం ఇచ్చారు. మార్కాపురం ప్రాంత సమస్యలపై శుక్రవారం ఒంగోలుకు వెళ్లి వినతి పత్రం అందజేశారు. వెలుగొండ ప్రాజెక్టును త్వరగా పూర్తిచేసి పశ్చిమ ప్రాంత ప్రజల ఆకాంక్ష నెరవేర్చాలని కోరారు. పశ్చిమ ప్రకాశంలో 60 వేల ఎకరాల అసైన్‌మెంట్ భూమి అందుబాటులో ఉందని, భారీ పరిశ్రమలను స్థాపించి యువతకు ఉపాధి చూపాలని కోరారు. ఆయన వెంట పట్టణ బీజేపీ అధ్యక్షుడు పొదర్తి ఆంజనేయులు, పలువురు నాయకులు ఉన్నారు.

టీడీపీ నేతల అధికార దర్పం!


కాలనీవాసులతో మాట్లాడుతున్న అధికారులు, నాయకులు

బేస్తవారిపేట: మండలంలోని ఖాజీపురంలో టీడీపీ నేతలు మంచినీటి పైపులైన్ ఏర్పాటు కోసం అడ్డగోలుగా వ్యవహరించడమే కాకుండా మండల స్థాయి అధికారులు, ఎస్సైతో సహా పదిమంది పోలీసులను మోహరింపజేసి అధికార దర్పం ప్రదర్శించారు. వివరాలు.. ఖాజీపురం ఎస్సీ కాలనీ(మాలపల్లె)లో సింగిల్ ఫేజ్ మోటార్ నుంచి పది వీధులకు నీరు సరఫరా అవుతోంది. నీరు అవసరమైనప్పుడు మెయిన్ పైపులైన్‌కు మోటార్ పైప్ తగిలించుకునేలా ఏర్పాటు చేసుకున్నారు. అయితే టీడీపీకి చెందిన ఓ వ్యక్తి తన ఇంటికి పర్మినెంట్‌గా పైపులైన్ ఏర్పాటు చేసుకోవాలని ప్రయత్నం చేశాడు. దీనిని కాలనీవాసులు మొత్తం కలిసి అడ్డుకున్నారు. అతనికిగానీ, ఆ వీధికి కాగాని పర్మినెంట్‌గా పైపులైన్ ఏర్పాటు చేస్తే పది వీధులకు నీటి సరఫరా నిలిచిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీడీఓ, ఎస్సై, ఎంపీపీ, టీడీపీ ముఖ్య నాయకులు, సర్పంచ్, ఆర్‌డబ్ల్యూస్ అధికారులు కాలనీవాసులతో చర్చించారు. మండల పరిషత్, పంచాయతీ నిధులతో ప్రతి వీధికి నూతన పైపులైన్ ఏర్పాటు చేసి, ప్రతి గృహానికి ట్యాప్ కనెక్షన్ ఇచ్చేలా తీర్మానం చేశారు. సామరస్యంగా మాట్లాడుకుని పరిష్కరించుకోవాల్సిన విషయాన్ని రచ్చ చేసి, పోలీసు బలగాలను దింపడంపై కాలనీవాసులు విస్మయం వ్యక్తం చేశారు.

నేడు డయల్ యువర్ డీఎం

మార్కాపురం: మార్కాపురం ఆర్టీసీ డిపోలో శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు తెలిపారు. ఆర్టీసీ బస్సుల రాకపోకల విషయంలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలతోపాటు సలహాలు, సూచనలను 99592 25699కు తెలియజేయాలని శుక్రవారం ఓ ప్రకటనలో సూచించారు. ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య డయల్ యువర్ డీఎం కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.

ఇంకుడు గుంతల నిర్మాణంపై దృష్టి సారించాలి

-డ్వామా పీడీ జి.జోసఫ్‌కుమార్


మాట్లాడుతున్న డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

రాచర్ల: ఇంకుడు గుంతల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డ్వామా పీడీ జి.జోసఫ్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 2023-24 సంవత్సర కాలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదికను ఎంపీడీవో వెంకటరామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ మాట్లాడుతూ ఈ నెల 15వన రాష్ట్రవ్యాప్తంగా ఇంకుడు గుంతలు నిర్మాణ పనులు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించడమే కాకుండా జిల్లాలోని 470 పంచాయతీల్లో 15 వేల ఇంకుడు గుంతలు నిర్మించాలని లక్ష్యాన్ని నిర్దేశించినట్లు తెలిపారు. ముందుగా ప్రతి పంచాయతీలో 4 అడుగుల పొడవు, వెడల్పుతో ఒక డెమో ఇంకుడు గుంతను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడిన సిబ్బందిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారిణి పి.ఝాన్సీ, విచారణ అధికారి వై.శ్రీకాంత్‌రెడ్డి, ఏపీడీ భాస్కర్‌రావు, ఏపీవోలు శ్రీనివాసరెడ్డి, మోసే తదితరులు పాల్గొన్నారు.

343 ఇంకుడు గుంతలు మంజూరు

కొమరోలు: మండలంలో 343 ఇంకుడు గుంతలు మంజూరైనట్లుగా ఎంపీడీఓ మస్తాన్‌వలి తెలిపారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో ఇంకుడు గుంతలు మంజూరైనట్లు చెప్పారు. వీటిని ఆయా గ్రామ పంచాయతీల్లో శనివారం ప్రారంభిస్తున్నామన్నారు. ఒక ఇంకుడు గుంత వద్ద డెమో కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

బాల్య వివాహాలను నిరోధిద్దాం


మార్కాపురం : మాట్లాడుతున్న కమిషనర్ నారాయణరావు



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు, పక్కన ఎంఈఓ శర్వాణి, అధికారులు


కొమరోలు : మాట్లాడుతున్న ఎంపీడీఓ మస్తాన్‌వలి

మార్కాపురం: బాల్య వివాహాలను నిరోధించేందుకు మండల స్థాయి అధికారులందరూ కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందని ఎంపీడీఓ బి.శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బంగారు బాల్యంపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలల్లో పోషకాహార లోపాన్ని నివారించాలన్నారు. గ్రామ స్థాయిలో ఐసీడీఎస్ సిబ్బంది అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని అందించడంతోపాటు బాల్యవివాహాలను నిరోధించేందుకు కృషిచేయాలన్నారు. ఎంఈఓ శర్వాణి మాట్లాడుతూ డ్రాపౌట్స్‌ను నిరోధించేందుకు సహకరించాలన్నారు. బడి ఈడు పిల్లలందరూ పాఠశాలలకు వెళ్లేలా చూడాలన్నారు. డీఎల్‌పీఓ వై.భాగ్యవతి, తహసీల్దార్ చిరంజీవి, ఎస్సై అంకమరావు, ఎంఈఓ-1 రాందాస్‌నాయక్, డాక్టర్ రోహిత్ నాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌తోపాటు వెలుగు ఏపీఎం పిచ్చయ్య, పంచాయతీ కార్యదర్శులు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

మార్కాపురం టౌన్: బంగారు బాల్యం కార్యక్రమంలో భాగంగా బాలికలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత టాస్క్‌ఫోర్సు కమిటీ సభ్యులపై ఉందని కమిషనర్ నారాయణరావు పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్లో బంగారు బాల్యం, మిషన్ శక్తి, కార్యక్రమంలో భాగంగా టాస్కుఫోర్సు కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలికలపై లైంగికదాడులను నివారించాలని, బాల్య వివాహాలను నిరోధించేందుకు కృషి చేయాలన్నారు. బాల కార్మికులను గుర్తించి వారికి విద్యపై అవగాహన కల్పించి, వారి సమాచారాన్ని సేకరించి సహాయం చేయాలని సూచించారు. ఫీల్డు లెవెల్లో ఉన్న మహిళా సంరక్షణ కార్యదర్శులు, వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీలు ఎప్పటికప్పుడు నివేదికలను సమర్పించాలన్నారు. కార్యక్రమంలో టౌన్ ఎస్సై సైదుబాబు, డీటీ ప్రభావతి, ఎంఈఓ రాందాస్‌నాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఎన్‌జీఓ నాయకులు, మెప్మా టౌన్ అధ్యక్షురాలు రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

బంగారు బాల్యంపై సమీక్ష

కొమరోలు: బంగారు బాల్యం కార్యక్రమంపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆరేళ్ల వయసులోపు పిల్లలను గుర్తించి వారికి సంబంధించిన ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ చేయించాలని ఎంపీడీఓ పేర్కొన్నారు. బాల్య వివాహాల నిరోధం, పాఠశాలల్లో డ్రాపౌట్స్ పిల్లల గురించి చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మస్తాన్‌వలి, తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఈఓపీఆర్డీ బ్రహ్మయ్య, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకురాలి కుటుంబానికి కేపీ పరామర్శ


రమాదేవి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కేపీ

గిద్దలూరు రూరల్: పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకురాలు బెల్లం రమాదేవి కుటుంబ సభ్యులను గిద్దలూరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె భర్త నరసింహారావుతోపాటుగా కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కేపీ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ.. బెల్లం రమాదేవి పార్టీ కోసం ఎనలేని సేవలు అందించారని గుర్తు చేసుకున్నారు. ఆమె మరణం పార్టీకి తీరని లోటు అని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ తరఫున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో 13వ వార్డు కౌన్సిలర్లు బాలిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు వేమిరెడ్డి రామచంద్రారెడ్డి, చేగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, కాతా నరసింహారెడ్డి, నాసరి శ్రీను, పోలేపల్లె శివ, దప్పిలి చిట్టి, పాలుగుళ్ల నరసింహారెడ్డి, కోట సత్యనారాయణ, గర్రె చిరంజీవి, ఓబుల్‌రావు, మిత్రరెడ్డి, హనుమరెడ్డి, పాలుగుళ్ల సుబ్బారెడ్డి, నూర్‌భాష, మత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గానికి 2,621 సోక్‌పిట్లు మంజూరు


సోక్‌పిట్లపై అవగాహన కల్పిస్తున్న డ్వామా ఏపీడీ

బేస్తవారిపేట: ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని డ్వామా ఏపీడీ ఎస్.భాస్కర్‌రావు సూచించారు. శుక్రవారం పిటికాయగుళ్ల గ్రామంలో సోక్‌పిట్ల నిర్మాణంపై ఎంజీఎన్ఆర్ఈజీఎస్ టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని 75 గ్రామ పంచాయతీలకు 2,621 సోక్‌పిట్లు మంజూరైనట్లు తెలిపారు. సోక్‌పిట్ల ఏర్పాటుతో దోమలు వృద్ధి చెందకుండా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు, భూగర్భజలాలు వృద్ధి చెందేందుకు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ గురువరకుమార్, టీఏ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

అమర జవాన్లకు ఘన నివాళి


అమర సైనికులకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

మార్కాపురం టౌన్: జమ్మూ కశ్మీర్‌లోని పుల్వామా వద్ద ముష్కరుల దాడిలో అమరులైన జవాన్లకు శుక్రవారం స్థానిక కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సిబ్బంది, విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ అన్నా కృష్ణచైతన్య ఆధ్వర్యంలో సమావేశమై అమరులైన వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. సైనికుల త్యాగాన్ని భారత ప్రజలు మర్చిపోరన్నారు. సైన్యానికి ప్రభుత్వం మరిన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పీవీ అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణం


స్వామివారు, అమ్మవార్ల కళ్యాణ క్రతువు నిర్వహిస్తున్న వేద పండితులు

ఒంగోలు మెట్రో: స్థానిక కర్నూలు రోడ్డులోని గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో స్వామివారి 17వ వార్షిక కళ్యాణ మహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఇంకొల్లు మధుసూదనాచార్య పర్యవేక్షణలో గోవిందమాంబ వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవ విగ్రహాలను పుష్పాలతో అలంకరించి కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ శాశ్వత ధర్మకర్తలు పేలప్రోలు రామకృష్ణ పరమహంస బిర్లా, పేలప్రోలు బ్రహ్మానందం దంపతులు, వారి కుటుంబ సభ్యులు కళ్యాణ ఉభయదాతలుగా వ్యవహరించారు. అర్చకుల మంత్రోచ్చారణ, మంగళ వాయిద్యాల నడుమ అట్టహాసంగా స్వామివారి కళ్యాణం సాగగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు. అనంతరం కళ్యాణానికి విచ్చేసిన భక్తులకు రుత్వికులు వేద ఆశీర్వచనం అందించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో రుత్వికులు నల్లపాటి కుమారస్వామి, ఏల్చూరి ప్రదీప్‌శాస్త్రి, పాలెపు వెంకటేశ్వరశర్మ, నూతలపాటి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.